ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 38.0 కనిష్ఠం : 25.0

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

సోమవారం 9 జూన్ 2025

మహిళాలోకం భగ్గు

● మహిళలపై అనుచిత వ్యాఖ్యలపై ఆందోళన ● జగన్ పత్రిక కార్యాలయం ఎదుట నిరసన

● ఆ పేపర్ ప్రతుల దహనం.. ● పలు స్టేషన్లలో కొమ్మినేని, కృష్ణంరాజుపై ఫిర్యాదు

7



అనంతపురంలో వద్ద జగన్ పత్రిక ప్రతులను దహనం చేస్తున్న తెలుగు మహిళలు



మీ ఇళ్లలో మహిళలు లేరా..?

ఏంటి ఈ సంస్కార హీనమైన మాటలు..!

అమరావతి మహిళలకు

జగన్‌రెడ్డి, భారతిరెడ్డి క్షమాపణ చెప్పాలి

ఆ జర్నలిస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే పరిటాల సునీత

7

జగన్.. క్షమాపణ చెప్పాలి

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



అనంత ప్రతిభ

ఈఏపీసెట్‌లో ఉమ్మడి జిల్లాకు ర్యాంకులు

● అగ్నిహోత్రికి రాష్ట్రస్థాయి 5వ ర్యాంకు

● ఇంజనీరింగ్‌లో 11,308 మంది..

అగ్రికల్చర్, ఫార్మసీలో 4,801 మంది పాస్..

● ఈసారి బాలురదే పైచేయి

7

అగ్నిహోత్రికి మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు



ఆనందవనం..!

జారుడు బండ్ల వద్ద సందడి చేస్తున్న ముస్లింలు









గుర్రాలపై సవారీ చేస్తున్న దృశ్యం

ఉయ్యాల ఊగుతూ...

అనంతపురంరూరల్, జూన్8(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిల్పారామం ఆదివారం కిటకిటలాడింది. బక్రీద్ పండుగ కావడంతో ముస్లింలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఏటా బక్రీద్ మరుసటి రోజు ముస్లింలు విహారయాత్రకు వెళ్తారు. అందులో భాగంగా కుటుంబీకులు, బంధువులతో కలిసి శిల్పారామానికి వచ్చారు. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో గడిపారు. గుర్రాలు, ఒంటెలపై విహరించారు. ఊయలలు ఊగుతూ, జారుడు బండపై జారుతూ సందడి చేశారు. చెట్ల కింద అందరూ కలసి భోజనం చేస్తూ కనిపించారు. శిల్పారామం ఆధ్వర్యంలో సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. వాటిని తిలకిస్తూ.. ఈలలు, కేకలు వేస్తూ సందడి చేశారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

అనంతపురం టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోనే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

వైద్యశాఖలో బదిలీల షాక్..!

సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ ట్రాన్స్‌ఫర్

● ఒంగోలుకు మాణిక్యాలరావు, కడపకు వెంకటేశ్వరరావు..

● అనంత వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా కేవీవీ సత్యనారాయణ

7

11న అనంతకు షర్మిల రాక

అనంతపురం న్యూటౌన్ : రాష్ట్ర పర్యటనలో భాగంగా 11న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అనంతపురం జిల్లా పర్యటనకు రానున్నారని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11న ఉదయం 10 గంటలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని విభాగాల నాయకులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగోన్నతులకు దూరం..!

● ముగిసిన ప్రమోషన్ల ప్రక్రియ

● మూడు రోజులుగా రాత్రింబవళ్లు పడిగాపులు ● ఖాళీలు 663.. భర్తీ 429.. ● దూర ప్రాంతాలకు వెళ్లడం ఇష్టంలేకే..

7



కంకర తేలిన రహదారులు

గ్రామీణులకు నరక ప్రయాణం

పట్టించుకోని అధికారులు

చింతలాంపల్లి రైల్వే ట్రాక్ వద్ద కంకర తేలిన రోడ్డు

ఇవి రోడ్లేనా..?



వజ్రకరూరు-చింతలాంపల్లి దారిలో తేలిన కంకర



డొనేకల్లు-ఆర్.కొట్టాల రోడ్డు దుస్థితి



కంకర తేలిన కరకముక్కల-పాల్తూరు రోడ్డు


విడపనకల్లు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రహదారులు పూర్తిగా ధ్వంసం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలు ఇవి రోడ్లేనా అన్న అనుమానం కలుగుతోంది. ఇంత దారుణంగా ఉన్నా అధికారులు పట్టించుకోలేదని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్లపై ప్రయాణం చేయాలంటేనే నరకానికి పయనమైనట్లు ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వజ్రకరూరు, విడపనకల్లు మండలాల్లో వివిధ గ్రామాలకు వెళ్లే దారులు శిథిలమై కంకర్లు తేలి కనీసం మనుషులు కాలి నడకన వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. చింతలాంపల్లి-వజ్రకూరు, డొనేకల్లు-ఆర్.కొట్టాల, పాల్తూరు-ఉరవకొండ రహదారులు పూర్తిగా శిథిలమయ్యాయి. వజ్రకరూరు మండలం చింతలాంపల్లి రోడ్డు మీదుగా గుత్తికి ద్విచక్రవాహనాలు, కార్లలో వెళుతుంటారు. ఉరవకొండ నుంచి వజ్రకరూరు, చింతలాంపల్లి మీదుగా వెళితే సమయం కలిసి వస్తుందని ద్విచక్ర, సొంత వాహనదార్లు ఈ రోడ్డు మీదనే వెళతారు. వజ్రకరూరు నుంచి చింతలాంపల్లి రైల్వేట్రాక్ వద్దకు వెళ్లేసరికి గంట సమయం పడుతుంది. నాలుగు కిలోమీటర్లు ప్రయాణానికే నరకం కనిపిస్తుంది. అడుగడుగునా గుంతలు, పూర్తిగా కంకర తేలిపోయి దారుణంగా తయారయింది. ఇరువైపులా కంప చెట్లు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించవు. డొనేకల్లు-ఆర్.కొట్టాల రోడ్డు పూర్తిగా శిథిలమైపోయింది. వైసీపీ హయాంలో నాలుగు కిలోమీటర్ల బీటీ రోడ్డును ఉపాధి హామీ పనుల్లో చేపట్టారు. పనులు చేయకుండానే బిల్లులు కాజేశారు. డొనేకల్లు నుంచి ఆర్.కొట్టాలకు వచ్చే దారి గతంలో వర్షాలకు కోతలకు గురైంది. అప్పటి నుంచి ఈ రోడ్డును ఎవరూ పట్టించుకోలేదు. ఆర్.కొట్టాల నుంచి డొనేకల్లు పెద్ద వంక వరకూ పెద్ద గుంతలు ఏర్పడి ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కరకముక్కల-పాల్తూరు రోడ్డును వైసీపీ హయాంలో కంకర వేసి వదిలేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపుతాం

కరకుముక్కల-పాల్తూరు, ఆర్.కొట్టాల-డొనేకల్లు రోడ్డుకు నిధులు మంజూరు కాలేదు. రోడ్లను పరిశీలించి వాటికి కావాల్సి నిధులకు ప్రతి పాదనలు పంపుతాం. పాల్తూరు రోడ్డుకు ఉపాధి హామీ నిధులు మంజూరయ్యాయి. ఐదేళ్ల క్రితం రోడ్డును సగం వేసి వదిలేశారు. దాన్ని పూర్తి చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. డొనేకల్లు రోడ్డుకు కూడా ప్రతి పాదనలు తయారు చేసి పంపుతాం.

-లక్ష్మీనారాయణ,
ఏఈ, పంచాయతీరాజ్‌శాఖ

యోగాతో ఆరోగ్యానికి మేలు..: కలెక్టర్



యోగా చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురంరూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): యోగా ఆరోగ్యానికి మేలు చేకూరుస్తుందని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాల్లో భాగంగా మండలంలోని శిల్పారామంలో ఆదివారం ఉదయం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. యోగా చేయడం ద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. ఈనెల 14న రాష్ట్రస్థాయి యోగా కార్యక్రమం అనంతపురంలో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా, మండల కేంద్రాలు, గ్రామస్థాయిలో సోమవారం యోగా మెగా ర్యాలీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలన్నారు. కలెక్టర్ యోగాసనాలు వేశారు. అనంతరం శిల్పారామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కలెక్టర్ కుటుంబ సభ్యులతోపాటు డీఆర్వో మలోల, జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి, జిల్లా పర్యాటక అధికారి జయకుమార్‌బాబు, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, డీఐపీఆర్ఓ గురుస్వామి రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించండి

● మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ● బుగ్గ రామలింగేశ్వరాలయాన్ని పరిశీలించిన పురావస్తు అధికారులు



అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

తాడిపత్రి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురాతనమైన బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఆదివారం కేంద్ర పురావస్తుశాఖ అధికారులు ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ ప్రభాకర్‌రెడ్డి పురావస్తుశాఖ అధికారులతో మాట్లాడుతూ.. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడానికి సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఆలయం లోపల, బయట మొత్తం పరిశీలించారు. ఇప్పటికే కల్యాణ మండపాన్ని పూర్తి చేశామని, పడమర, ఉత్తరం వైపు ఉన్న ప్రహారీల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. అవసరమైతే తమ డబ్బులతోనే ఆలయాలను నిర్మిస్తామని, అనుమతులు ఇవ్వాలని కోరారు. ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూర్యముని, ఎస్వీ రవీంద్రారెడ్డి, కమిటీ సభ్యులు చంద్రమోహన్‌నాయుడు, మాజీ చైర్మన్ పోలిశెట్టి ఆంజనేయులు, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు సురేంద్ర గుప్తా ఉన్నారు.

స్వర్ణ సంబరం..

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూనియర్ మహిళల హాకీ పోటీల్లో అనంత అమ్మాయిలు అదరగొట్టారు. హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మూడురోజులుగా నిర్వహించిన పోటీల్లో జిల్లా జట్టు చాంపియన్‌గా అవతరించింది. స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. పోటీల చివరిరోజు ఆదివారం నిర్వహించిన ఫైనల్లో అన్నమయ్య జిల్లా జట్టుతో తలపడింది. మ్యాచ్‌లో అనత జట్టు ఆది నుంచీ ఆధిపత్యం చెలాయించింది. 5-0 గోల్స్ తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. అనంతరం జట్టుకు ట్రోఫీ, స్వర్ణ పతకాలు ప్రదానం చేశారు. జట్టును జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమాంర్, కోచ్ శంకర్, మేనేజర్ సంతోష్ అభినందించారు.



జిల్లా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

క్రైం కార్నర్

కారు, ద్విచక్రవాహనం ఢీ

- ఇద్దరి మృతి
- మరొకరికి తీవ్రగాయాలు



షేక్‌మహమ్మద్ సుహేల్, మహమ్మద్ లతీఫ్ (ఫైల్)

నంబులపూలకుంట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కంవారిపల్లి సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఏఎస్ఐ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తనకల్లు మండలంలోని మారెప్పగారిపల్లికి చెందిన షేక్‌మహమ్మద్ సుహేల్, మహమ్మద్ లతీఫ్, తోసీఫ్ తిమ్మమ్మ మర్రిమానును సందర్శించడానికి ద్విచక్రవాహనంలో బయలు దేరారు. తిమ్మమ్మ మర్రిమాను నుంచి కొక్కంటి క్రాస్‌కు వస్తున్న కారు ముక్కంవారిపల్లి వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో షేక్ మహమ్మద్ సుహేల్ (16) అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన మహమ్మద్‌లతీఫ్(17)ను కదిరికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కన్నుమూశాడు. తోసీఫ్‌ను 108లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సుహేల్ పదో తరగతి, లతీఫ్ ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో చేరాల్సి ఉంది. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

24 కిలోల గంజాయి సీజ్



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

అనంతపురం న్యూటౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో జీఆర్పీఎఫ్, ఆర్పీఎఫ్ సిబ్బంది ఉమ్మడిగా రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో కందుకూరు కొట్టాలకు చెందిన బిస్కెట్ ఫయాజ్, బిస్కెట్ మహబుబ్‌పీరా భువనేశ్వర్ నుంచి అనంతపురానికి గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వారి వద్ద ఉన్న దాదాపు 24 కిలోల గంజాయి ఉన్న రెండు బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీఎఫ్ ఎస్ఐ వెంకటేశ్, ఆర్పీఎఫ్ ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. గంజాయి విలువ సుమారు రూ.1.20 లక్షలు ఉంటుందని వారు వివరించారు.

ఇంటర్ విద్యార్థిని దారుణ హత్య

- 3న అదృశ్యం.. 4న ఫిర్యాదు
- పట్టించుకోని పోలీసులు
- 7న మృతదేహం లభ్యం



తన్మయి (ఫైల్)

అనంతపురం క్రైం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థిని దారుణ హత్యకు గురైంది. అనంతపురం నగరంలోని రామకృష్ణ కాలనీకి చెందిన లక్ష్మీపతి కుమార్తె తన్మయి(19)నగరంలో వివేకానంద కళాశాలలో ఇంటర్ సెకెండియర్ చదివింది. సెలవులు కావడంతో ఇంటి వద్దే ఉంటోంది. ఈనెల 3వతేదీ రాత్రి కడుపునొప్పిగా ఉందని కూల్‌డ్రింక్స్ తెచ్చుకుంటానని చెప్పి బయటకెళ్లింది. ఎంతసేపైనా ఇంటికి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికిన తల్లిదండ్రులకు కనిపించకపోవడంతో 4వతేదీ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేరోజు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 7న కూడేరు మండలం గొట్కూరు సమీపంలో అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారి పక్కన గుర్తు తెలియని శవం ఉందని పశువుల కాపర్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కూడేరు సీఐ రాజు సిబ్బందితో కలిసి పరిశీలించారు. పోలీసులు గుర్తు తెలియని యువతి మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. తలపై తీవ్రగాయాలైనట్లు నిర్ధారించారు.

జిల్లా వ్యాప్తంగా 72 మిస్సింగ్ కేసులు...

మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు తొలుత 26 నుంచి 28 ఏళ్ల వయసు ఉండవచ్చని భావించారు. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇచ్చారు. జిల్లా మొత్తంపై 72 మంది మహిళలు అదృశ్యమైనట్లు తేలింది. అందులో ఆ వయసు యువతి లేరన్నట్లు నిర్ధారించారు. చివరకు అనంతపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యమైన యువతికి సంబంధించి ఆరా తీశారు. తల్లిదండ్రులను పిలిపించి పరిశీలించారు. దుస్తులు, చెప్పుల ఆధారంగా తమ కూతురేనని నిర్ధారించుకున్నారు. కుమార్తె మృతదేహాన్ని ఆ స్థితిలో చూసి బోరుమన్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు..

పోలీసులు మృతదేహాన్ని తల్లిదండ్రులు గుర్తించడంతో ఆదివారం మార్చురీ గదిలో పోస్టుమార్టం నిర్వహించారు. అక్కడ తల్లిదండ్రులు మీడియాతో ఆవేదన వ్యక్తం చేశారు. అదృశ్యమైన మరుసటి రోజే ఫిర్యాదు చేశామని, పోలీసులు కాల్ లిస్ట్ తీస్తామని చెప్పి కాలయాపన చేశారని వాపోయారు. ముందుగానే గుర్తించి ఉంటే తమ కుమార్తె బతికి ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమార్తెను అలా చేసిన వాడిని శిక్షించాలని వేడుకున్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు..

విద్యార్థి హత్యకేసును విచారణ చేపడుతున్న వన్‌టౌన్ పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారిని విచారిస్తున్నట్లు సమాచారం. సీసీ టీవీ ఫుటేజీలు, కాల్ రికార్డ్స్‌పై పోలీసులు ఆరా తీస్తున్నారు.

తగ్గిన పశువుల సంత ఆదాయం

అనంతపురంరూరల్, జూన్8(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన వారంతపు పశువుల సంత ఆదాయం ఈవారం తగ్గింది. బక్రీద్ పండుగ నేపథ్యంలో గత రెండు వారాలు రూ.5లక్షలకు పైగా మార్కెట్‌కు ఆదాయం వచ్చింది. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతలో రూ.1,89,610, ఆదివారం జరిగిన ఎద్దులు, ఎనుముల సంతతో రూ.60,100 మార్కెట్‌కు ఆదాయం వచ్చింది. రెండురోజుల సంతతో రూ.2,49,710 మార్కెట్‌కు వచ్చినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

ఉద్యోగోన్నతులకు దూరం..!

- ముగిసిన ప్రమోషన్ల ప్రక్రియ
- మూడు రోజులుగా రాత్రింబవళ్లు పడిగాపులు
- ఖాళీలు 663.. భర్తీ 429..
- దూర ప్రాంతాలకు వెళ్లడం ఇష్టంలేకే..

> ఉద్యోగం చేసే వారెవరైనా ఉన్నత స్థానం కోరుకోవడం సహజం. కానీ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇస్తామంటున్నా వద్దంటున్నారు. సెకెండరీ గ్రేడ్ టీచర్ నుంచి స్కూల్ అసిస్టెంట్, తత్సమాన పోస్టులకు ఉద్యోగోన్నతికి అవకాశం కల్పిస్తున్నా.. సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండడంతో చాలా మంది వద్దని రాసిచ్చి వెళ్లిపోతున్నారు.

అనంతపురం విద్య, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సెకెండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్, తత్సమాన పోస్టుల ప్రమోషన్ల ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది. మూడు రోజులుగా రేయింబవళ్లు సాగిన ఈ తంతు ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు ముగిసింది. చాలా పోస్టులకు ప్రమోషన్లు తీసుకోడానికి ఉపాధ్యాయులు విముఖత చూపారు. దగ్గర ప్రాంతంలో ఖాళీలు దొరక్కపోవడంతో... వందలాది మంది టీచర్లు ప్రమోషన్ల తీసుకోడానికి ససేమిరా అంటూ నాట్ ఆప్షన్ ఇచ్చి వెళ్లిపోయారు. జడ్పీ, మున్సిపల్, కార్పొరేషన్, ప్రభుత్వ యాజమాన్య స్కూళ్లలో 663 ఖాళీలకుగాను, 429 పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి.

తెల్లవారుజాము వరకూ...

ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయ పోస్టులకు మూడు రోజులపాటు ప్రమోషన్లు నిర్వహించారు. జడ్పీలో 304, మున్సిపాలిటీల్లో 304, మున్సిపల్ కార్పొరేషన్‌లో 52, గవర్నమెంట్‌లో 3 పోస్టులకు మూడు రోజులుగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్, కౌన్సిలింగ్ నిర్వహించారు. చాలా మంది దగ్గరి స్కూళ్లు, తాము కోరుకున్న ప్లేసులు దొరకడం లేదంటూ దూరంగా ఉంటూ వచ్చారు. 'రండి సార్, రండి మేడం.....ప్రమోషన్లు తీసుకోండి' అంటూ టీచర్లను బతిమాలే పరిస్థితి అధికారులకు తప్పలేదు. కొన్ని పోస్టులకు 1:10 నిష్పత్తిలో టీచర్లను కౌన్సెలింగ్‌కు పిలవాల్సి వచ్చింది. అభ్యర్థులు రాకపోవడంతో..ఫోన్లు చేసి పిలిచారు. దీంతో మూడు రోజులు అర్ధరాత్రి దాటి, తెల్లవారుజాము 3 గంటలకు, 5 గంటల వరకూ కౌన్సెలింగ్ సాగింది. చివరికి వచ్చినవాళ్లకు ప్రమోషన్ల ఇచ్చి ముగించారు. ప్రమోషన్ పోస్టులు 663 ఖాళీల్లో యాజమాన్యాల వారీగా చూస్తే... గవర్నమెంట్‌లో 1, జడ్పీలో 211 పోస్టులు, మున్సిపాలిటీల్లో 189, మున్సిపల్ కార్పొరేషన్‌లో 28 పోస్టులు భర్తీ చేశారు.

మీడియం, సబ్జెక్టుల వారీగా పోస్టుల వివరాలు

ప్రైమరీ హెచ్‌ఎం(కన్నడ మీడియం) 1, ప్రైమరీ హెచ్‌ఎం (తెలుగు మీడియం) 130, ప్రైమరీ హెచ్‌ఎం (ఉర్దూ) 10 పోస్టులు భర్తీ చేశారు. అదేవిధంగా స్కూల్ అసిస్టెంట్లు(లాంగ్వేజస్) ఇంగ్లీష్ 46 పోస్టులు, హిందీ 1, తెలుగు 1, ఉర్దూ 1, స్కూల్ అసిస్టెంట్లు (నాన్‌లాంగ్వేజస్) బయాలజీ 38 (తెలుగు మీడియం), ఉర్దూ మీడియంలో 4, గణితం (తెలుగుమీడియం) 80, ఉర్దూ మీడియం 5, ఫిజికల్ ఎడ్యుకేషన్ (తెలుగుమీడియం) 6, ఫిజికల్ సైన్స్‌లో 46 (తెలుగు మీడియం), కన్నడ మీడియంలో 1, ఉర్దూ మీడియంలో 1, సోషల్‌లో 50 (తెలుగుమీడియం), కన్నడ మీడియంలో 2, ఉర్దూ మీడియంలో 6 పోస్టులకు ప్రమోషన్లు ఇచ్చారు. చాలా ఖాళీలు అలాగే మిగిలిపోయాయి.



పీఎస్‌హెచ్‌ఎం పోస్టుల కౌన్సిలింగ్ తక్కువగా వచ్చిన టీచర్లు

మహిళాలోకం భగ్గు



జగన్ పత్రిక కార్యాలయం ఎదుట నినదిస్తున్న తెలుగు మహిళలు

అనంతపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): 'వేశ్యల రాజధాని అమరావతి' అంటూ జగన్ చానల్ డిబేట్‌లో చేసిన వ్యాఖ్యలపై మహిళాలోకం భగ్గుమంది. జిల్లావ్యాప్తంగా ఆదివారం తెలుగు మహిళలు ఆందోళనలకు దిగారు. జగన్ మీడియాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యావత్ మహిళాలోకాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు కృష్ణంరాజు, ఆయన వ్యాఖ్యలను సమర్థిస్తూ యాంకర్‌గా వ్యవహరించిన మరో జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుతోపాటు చానల్ యజమాని భారతీరెడ్డిపై చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఉమ్మడి అనంత జిల్లా జగన్ పత్రిక యూనిట్ కార్యాలయం ఎదుట తెలుగు మహిళ రాష్ట్ర నేతలు స్వప్న, సంగా తేజస్విని ఆధ్వర్యంలో పలువురు తెలుగు మహిళలు నిరసనకు దిగారు. ఆ పత్రిక ప్రతులను దహనం చేశారు. తెలుగు మహిళలను అరెస్టు చేసి, నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. వైఎస్ భారతి, జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు తెలుగు మహిళలు ఫిర్యాదు చేశారు. ఉరవకొండలో నిరసనకు దిగారు. రాప్తాడులో తెలుగు మహిళలు పోలీసు స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కళ్యాణదుర్గంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట నినాదాలు చేశారు. సీఐ యువరాజుకు ఫిర్యాదు అందజేశారు. తాడిపత్రిలో మహిళా కౌన్సిలర్లు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెనుకొండలో టీడీపీ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడే జగన్ పత్రిక ప్రతులను దహనం చేశారు. ఆ తర్వాత ఎస్ఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. తెలుగు మహిళల ఆందోళనలతో జిల్లా అట్టుడికింది.

జగన్.. క్షమాపణ చెప్పాలి
- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల: వైసీపీ నేత జగన్‌రెడ్డి.. రాష్ట్ర మహిళలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. అమరావతికి భూములు ఇచ్చిన రైతు కుటుంబాల్లోని మహిళల పట్ల జగన్ చానల్‌లో చేసిన అసభ్య వ్యాఖ్యలను ఖండించారు. ప్రజల దృష్టి మరల్చేందుకు జగన్ చేస్తున్న నీచ రాజకీయాలను అందరూ గమనిస్తున్నారని వివరించారు.

మీ ఇళ్లలో మహిళలు లేరా..?
- ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురంరూరల్: సొంత చానల్ డిబేట్‌లో జర్నలిస్టుల ముసుగులో ఉన్న సంస్కారహీనులు చేసిన వ్యాఖ్యలకు జగన్‌రెడ్డి, భారతి రెడ్డి క్షమాపణ చెప్పాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత డిమాండ్ చేశారు. జగన్ చానల్ డిబేట్‌లో రాజధాని అమరావతిపై జర్నలిస్టు కృష్ణంరాజు చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. రాజధాని కోసం తమ భూములను ఇచ్చిన గొప్ప మనసున్న వారు అమరావతి ప్రాంత మహిళలన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి రాజధానిలో విధ్వంసం సృష్టిస్తుంటే అమరావతి ప్రాంత మహిళలు 1630 రోజులు ఉద్యమం చేశారని గుర్తుచేశారు. సీఎం చంద్రబాబు దేవతల రాజధాని అంటే కృష్ణంరాజు అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఈ విషయాన్ని ఖండించాల్సిన కొమ్మినేని శ్రీనివాసరావు కనీస విజ్ఞత లేకుండా నవ్వుతున్నారన్నారు. మహిళలపై ఇంత నీచంగా మాట్లాడితే చర్యలు తీసుకోవడంలో ఆలస్యం ఎందుకని ప్రశ్నించారు. కొమ్మినేని, కృష్ణంరాజు ఇళ్లలో మహిళలు ఉన్నారనే విషయాన్ని మరచిపోయారా అని నిలదీశారు. వెంటనే వారిని అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుంభకోణాలపై ప్రజా దృష్టి మళ్లించడానికే అమరావతిపై ఈ దుర్మార్గపు దాడి చేయించారన్నారు.

మీ ఇంటి అమ్మాయిని ఇలాగే రోడ్డుకు లాగుతారా..?

- ప్రకాష్‌రెడ్డిపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఫైర్

అనంతపురం రూరల్, జూన్8(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలంలో బాలికపై అఘాయిత్యం జరిగితే ఆ విషయాన్ని రోడ్డుకెక్కేలా చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై ఎమ్మెల్యే పరిటాల సునీత మండిపడ్డారు. 'మీ ఇంటి అమ్మాయికి ఇలా జరిగితే ఇంత బహిరంగంగా మాట్లాడతారా' అంటూ నిలదీశారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదివారం మీడియాతో మాట్లాడారు. బాధిత బాలికను ఫోన్‌లో ఆమె పరామర్శించి.. ధైర్యం చెప్పారు. బాధిత బాలిక తల్లితో కూడా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆ బిడ్డకు జరిగిన ఘటన అత్యంత బాధాకరమన్నారు. బాలిక అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు దుర్మార్గులు దారుణానికి ఒడిగట్టారన్నారు. విషయాన్ని పదే పదే ప్రస్తావిస్తూ పార్టీలకు ఆపాదిస్తూ ప్రకాష్‌రెడ్డితోపాటు వైసీపీ నాయకులు రాక్షసానందం పొందుతున్నారన్నారు. ఇప్పటికే ఈ దుర్మార్గానికి పాల్పడిన వారిని అరెస్టు చేస్తున్నారనీ, ఇందులో వైసీపీ వారు కూడా ఉన్నారని దానికి ప్రకాష్‌రెడ్డి ఏం సమాధానం చెబుతారన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు నీచ రాజకీయాలు మాని ఆ బాలికకు అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో రాప్తాడు మార్కెట్ యార్డు ఛైర్మన్ సుధాకర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ ఉద్యోగుల బదిలీలపై ఉత్కంఠ.!

- 14 మంది ఏపీఎం, 42 మంది సీసీల ట్రాన్స్‌ఫర్‌కు సెర్ప్ ఆదేశాలు
- సస్పెండైన వారిపైనే ఒత్తిడి
- ప్రభుత్వం మారినా వారిదే హవా



డీఆర్‌డీఏ కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ-సెర్ప్ ఉద్యోగుల బదిలీలపై ఉత్కంఠ నెలకొంది. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలని సెర్ప్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. గత 15 ఏళ్లలో అవినీతి, అక్రమాల ఆరోపణలు ఎదుర్కొని సస్పెన్షన్ వేటు పడిన ఉద్యోగులను ఇతర జిల్లాలకు బదిలీ చేయాలని ఉత్తర్వుల్లో సెర్ప్ పేర్కొంది. సెర్ప్ ఆదేశాలను పాటిస్తారా లేక ఐదేళ్ల ఒకే స్థానంలో సర్వీస్ పూర్తి చేసిన వారిని బదిలీ చేస్తారా అనేది ఉత్కంఠ నెలకొంది. గడిచిన 15 ఏళ్లలో ఉమ్మడి జిల్లాలో 14 మంది ఏపీఎంలు, 42 మంది సీసీలు సస్పెన్షన్‌కు గురయ్యారు. వారిని అంతర్ జిల్లా బదిలీలు చేస్తారనే ప్రచారం సాగుతోంది. గత సోమవారం టీటీడీసీలో జరిగిన ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్‌ను మధ్యలోనే నిలిపివేశారు. 14 మంది ఏపీఎంలు, 42 మంది సీసీల జాబితాను సెర్ప్‌కు పంపారు. అనంతపురం జిల్లాలో ఆరుగురు, శ్రీసత్యసాయి జిల్లా ఎనిమిది మంది మొత్తం 14మంది ఏపీఎంలు క్రమశిక్షణా చర్యలు తీసుకున్న వారిలో ఉన్నారు. సీసీలు అనంతపురం జిల్లా 20 మంది, శ్రీసత్యసాయి జిల్లా 22 మంది మొత్తం 42 మంది జాబితాలో ఉన్నారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారిలో ఉమ్మడి జిల్లా మొత్తానికి తలుపులలో పనిచేస్తున్న ఏపీఎం బాబ్జీ మాత్రమే ఉన్నారు. సీసీల విషయానికొస్తే.. ఉమ్మడి జిల్లాలో మొత్తం 22 మంది ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారిలో ఉన్నారు.

మళ్లీ వారిదే..

వైసీపీ ప్రభుత్వంలో డీఆర్‌డీఏలో పెత్తనం చెలాయించిన వాళ్లే కూటమి ప్రభుత్వంలోనూ ఆధిపత్యాన్ని కొనసాస్తున్నారు. వైసీపీ హయాంలో ఉమ్మడి జిల్లాలోని అప్పటి ఓ ప్రజాప్రతినిధి అండతో ప్రాధాన్యత స్థానాల్లో ఉంటూ నడిపించిన ఉద్యోగులే తిరిగి కీలకపోస్టుల్లో ఉంటున్నారు. గత అక్టోబరులో జరిగిన బదిలీల్లో స్థానచలనం పొందిన ఉద్యోగులు తిరిగి తాము కోరుకున్న స్థానాల్లోకి చేరాలని తీవ్రప్రయత్నాలు చేస్తున్నారు. డీఆర్‌డీఏ పీడీ కార్యాలయంలో పనిచేస్తూ జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఓ మండలానికి బదిలీ అయిన ఓ ఉద్యోగి తిరిగి జిల్లా కేంద్రానికి రావాలని ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. సత్యసాయి జిల్లాలో పనిచేస్తూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ఉద్యోగి అనంతపురానికి రావడానికి ఆపసోపాలు పడుతున్నట్లు తెలిసింది. ఇందుకు సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న కీలక అధికారుల సహకారం అందిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. పింఛన్ల పునఃపరిశీలనలో ఆరోపణలు ఎదుర్కొన్న ఉద్యోగులను కాపాడిన ఆ కీలక అధికారి బదిలీల్లో కూడా చక్రం తిప్పుతున్నారనే చర్చ సాగుతోంది.

సెర్ప్ ఆదేశాల మేరకు బదిలీలు



సెర్ప్ ఆదేశాల మేరకు ఉద్యోగుల బదిలీలు ఉంటాయి. ఐదేళ్లు ఒకే చోట పనిచేసిన ఉద్యోగులతో పాటు గడిచిన 15 ఏళ్లలో క్రమశిక్షణా చర్యలు తీసుకున్న ఉద్యోగుల జాబితాను సెర్ప్‌కు పంపాలని ఆదేశించారు. ఆ మేరకు ఏపీఎంలు, సీసీల జాబితాలు పంపాం. ఐదేళ్లు ఒకే చోట పనిచేసిన ఉద్యోగుల జాబితాను సిద్ధం చేశాం. వీటితో పాటు రిక్వెస్ట్, స్పౌజ్ ఉద్యోగుల వివరాలను కూడా నమోదు చేశాం. సెర్ప్ జారీ చేసిన నిబంధనల ప్రకారం బదిలీలు జరుగుతాయి.

-శైలజ, పీడీ, డీఆర్‌డీఏ

అనంత ప్రతిభ

- ఈఏపీసెట్‌లో ఉమ్మడి జిల్లాకు ర్యాంకులు
- అగ్నిహోత్రికి రాష్ట్రస్థాయి 5వ ర్యాంకు
- ఇంజనీరింగ్‌లో 11,308 మంది.. అగ్రికల్చర్, ఫార్మసీలో 4,801 మంది పాస్..
- ఈసారి బాలురదే పైచేయి..



జశ్వంత్‌రెడ్డి

అనంతపురం సెంట్రల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశాలకు నిర్వహించిన ఏపీఈఏపీసెట్‌లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. అనంతపురం నగరానికి చెందిన నితిన్ అగ్నిహోత్రి రాష్ట్రస్థాయిలో ఐదో ర్యాంకు సాధించి, జిల్లా ఖ్యాతిని చాటారు. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ఈఏపీసెట్ ఫలితాలను విడుదల చేసింది. ఉమ్మడి జిల్లా నుంచి 23,743 మంది విద్యార్థులకుగాను 16109 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 11,308 మంది ఇంజనీరింగ్‌లో 4,801 మంది అగ్రికల్చర్, ఫార్మసీలో ఉత్తీర్ణులయ్యారు. ఇంజనీరింగ్ ఫలితాల్లో ఈసారి బాలురే పైచేయి సాధించారు. 5,895 మంది బాలురు, 5,413 మంది బాలికలు పాసయ్యారు. ఫార్మసీలో 1,197 మంది బాలురు, 3,604 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు.

టాప్‌లేపిన విద్యార్థులు..: ఈఏపీసెట్‌లో 40 మంది విద్యార్థులు 1500లోపు ర్యాంకులు సాధించి ఉమ్మడి జిల్లా పోటీతత్వాన్ని ప్రదర్శించారు. ఇంజనీరింగ్ పరీక్షల్లో స్టేట్ ఐదో ర్యాంకుతో నితిన్ అగ్నిహోత్రి అదరగొట్టాడు. మొరవకొత్తపల్లికి చెందిన 87వ ర్యాంకుతో సత్తాచాటాడు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షల్లోనూ విడపనకల్లుకు చెందిన అశుతోష్ 19వ ర్యాంకుతో దుమ్మురేపాడు. రాష్ట్రస్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించి జిల్లా ఖ్యాతిని చాటారు. ఇంజనీరింగ్‌లో శశిధర్‌రెడ్డి 133, విశాల్ 151, అనిరుధ్ 236, రేవంత్ 259, సర్వజిత్ 263, ఓమ్ కిరణ్ 264, షారన్ మౌర్య 373వ ర్యాంకుతో మెరిశారు. అగ్రికల్చర్, ఫార్మసీలో అశుతోష్ 19, తరుణ్ తేజ 25, సైనారెడ్డి 71 వందలోపు ర్యాంకులు సాధించారు.

ఏఐలో ఇన్నోవేషన్
-నితిన్ అగ్నిహోత్రి, ఇంజనీరింగ్ 5వ ర్యాంక్

ప్రపంచాన్ని శాసిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ(ఏఐ)లో ఇన్నోవేషన్‌ను క్రియేట్‌చేసి టెక్నాలజీని మరింత సులువుగా ప్రజలకు అందించేందుకు కృషిచేస్తాను. మాది అనంతపురం. అమ్మ కళ్యాణి గృహిణి కాగా నాన్న శ్రీకాంత్ బిల్డర్‌గా పనిచేస్తున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 183 ర్యాంకువచ్చింది.

సివిల్ సర్వీసెస్...
-జస్వంత్‌రెడ్డి, ఇంజనీరింగ్ 87వ ర్యాంక్

సివిల్ సర్వీసెస్ సాధించి పేదలకు ప్రభుత్వ సేవలందించాలని ధ్యేయంగా పెట్టుకున్నాను. మాది హిందూపురం. అమ్మ మాలతీ ఎల్ఆర్జీలో టీచర్‌గాను. నాన్న శ్రీనివాసరెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఐటీలో 707 ర్యాంక్ వచ్చింది. కరగ్‌పూర్‌లో ఐటీ సీఎస్‌లో సీటు వస్తుంది.

వైద్యశాఖలో బదిలీల షాక్..!

- ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌పై వేటు
- ఒంగోలుకు మాణిక్యాలరావు, కడపకు వెంకటేశ్వరరావు..
- అనంత వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా కేవీవీ సత్యనారాయణ

అనంతపురం టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): వైద్యశాఖలో అనూహ్యంగా ఉన్నతాధికారుల బదిలీలతో ఆ శాఖ వర్గాలు ఉలిక్కిపడ్డాయి. తొలుత కిందిస్థాయి డాక్టర్లు, ఇతర విభాగాల ఉద్యోగులు, తర్వాత వైద్యాధికారుల బదిలీలు ఉంటాయనే ప్రచారం సాగింది. ఊహించని విధంగా వైద్యాధికారులపై బదిలీ వేటువేయడం ఆ శాఖలో ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఆదివారం రాష్ట్ర వైద్యశాఖ కమిషనర్ బదిలీల ఉత్తర్వులు జారీచేశారు. అనంత జిల్లా వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావును ఒంగోలు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా, జిల్లా సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావును కడప జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. ప్రిన్సిపాల్ మాణిక్యాలరావును ఒంగోలు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావుకు సంబంధించి కళాశాలలో జరుగుతున్న వ్యవహారాలు, ఆరోపణల నేపథ్యంలో బదిలీ అవుతారని చర్చలు వినిపించాయి. సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు రాష్ట్ర వైద్యశాఖ అడిషనల్ డీఎంఈగా ఉద్యోగోన్నతి పొందుతున్నారని చర్చలు సాగాయి. మరోవైపు ఆయన సర్వీస్ ఏడాది ఉండడంతో జిల్లాలోనే కొనసాగి ఉద్యోగ విరమణ చేస్తారని ఊహించారు. అనంత వైద్యకళాశాలకు కొత్త ప్రిన్సిపాల్‌గా గుంటూరు మెడికల్ కాలేజీలో న్యూరో సర్జరీ ప్రొఫెసర్ కేవీవీ సత్యనారాయణను నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులు వచ్చాయి. జిల్లా ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్ నియామకం జరగలేదు. దీంతో ఎవరిని సూపరింటెండెంట్‌గా నియమిస్తారోనని ఉత్కంఠగా చూస్తున్నారు.

టీచర్లను ఇబ్బంది పెట్టొద్దు

ఐక్యవేదిక నాయకులు.. డీఈఓ కార్యాలయం ముట్టడి



నిరసన తెలుపుతున్న టీచర్లు, నాయకులు

అనంతపురం విద్య, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం టీచర్లను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు. ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలంటూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు డీఈఓ కార్యాలయం ముందు రోడ్డుపై కూర్చుని నిరసన తెలిపారు. మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని, వెబ్ కౌన్సెలింగ్ వద్దు అంటూ నినాదాలు చేశారు. సుమారు గంట పాటు రోడ్డుపై నిరసన తెలిపారు. డీఈఓ ప్రసాద్‌బాబు వచ్చి మాట్లాడినా.. నాయకులు వినిపించుకోలేదు. తర్వాత డీఈఓ కార్యాలయంలో కాసేపు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు సంఘాల నాయకులు మాట్లాడుతూ.. బదిలీల కౌన్సెలింగ్ మాన్యువల్‌గా నిర్వహిస్తామని చెప్పి, ఇప్పుడు వెబ్ కౌన్సెలింగ్ అనడం సరికాదని మండిపడ్డారు. టీచర్లను ఇబ్బంది పెడితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. తర్వాత టీచర్ల, సంఘాల నాయకులను పోలీసులు శాంతింపజేసి కార్యాలయం నుంచి బయటకు పంపారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు నాగిరెడ్డి, వెంకటరత్నం, రమణారెడ్డి, శ్రీధర్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, లింగమయ్య, శ్రీనివాస్ నాయక్, విశ్వనాథ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గౌని పాతిరెడ్డి, సిరాజుద్దీన్, వెంకటేషులు, జయచంద్రారెడ్డి, గోవిందరాజులు, ఎర్రిస్వామి, రవీంద్ర, జయరాం నాయక్, రామాంజనేయులు, ఓబులేసు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మాధవరాజుల పరుష ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో మాధవరాజుల స్వామి

కనగానపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భానుకోట గ్రామంలో మాధవరాజుల స్వామి తొలిపూజలందుకోవడంతో ఆదివారం పరుష ప్రారంభమైంది. మూడు రోజులు పాటు జరిగే పరుషలో బండ్లు కొలువుతో స్వామిని ఘనంగా ఊరేగింపు చేస్తారు. సోమవారం జలధి పూజ ఉంటుందని, మంగళవారం స్వామివారి గ్రామప్రవేశంతో జాతర ముగుస్తుందని గ్రామ పెద్దలు తెలిపారు.

జూనియర్ కళాశాల భవనాల నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ, నాయకులు

ఆత్మకూరు జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జూనియర్ కళాశాల నూతన భవనా ల నిర్మాణానికి ఆదివారం భూమి పూజ జరిగింది. టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ, మండల కన్వీనర్ శ్రీనివాసులు ముఖ్యఅతిథులుగా పాల్గొని భూమిపూజ చేపట్టారు. అనంతరం బాలాజీ మాట్లాడుతూ ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవతో జూనియర్ కళాశాల భవనాల నిర్మాణానికి రూ. 1కోటి 26లక్షల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. భవనాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, హిందూపురం పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి, నాయకులు మనోరంజన్, మాధవరెడ్డి ,ప్రభాకర రెడ్డి, సూరి, శ్రీనివాస రెడ్డి, రవీంద్రారెడ్డి, గోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల పక్కదారి అవాస్తవం

చెన్నేకొత్తపల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగసముద్రం పంచాయతీ లోని నిధులు పక్కదారి పట్టాయని అదే గ్రామంలోని అధికార పార్టీకి చెందిన నాయకుడు ఆరోపించడంలో ఏమాత్రం వాస్తవం లేదని సర్పంచు సుధారాణి పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ఆమె తన భర్త ఓబులేసు, పలువురు వైసీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టిన తర్వాతనే అధికారులు బిల్లులు చేశారన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. పంచాయతీ నిధుల్లో రూ. 12లక్షల వరకు అవినీతి జరిగిందని టీడీపీనాయకులు ఆరోపించడం తగదన్నారు.

నేడు రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలి రాక

రామగిరి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలో అత్యాచారానికి గురైన బాలికను పరామర్శించేందుకు, జరిగిన ఘటనపై విచారించేందుకు రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు సాహిక్ రోకియా బేగం సోమవారం రానున్నారు. ఆమె బాధితురాలిని గ్రామానికి వెళ్లి పరామర్శించనున్నట్లు తహసీల్దార్ జమానుల్లా శనివారం తెలిపారు. ఆమె వెంట సత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్, జిల్లా ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అధికారి, ఆర్‌డీఓ తదితరులు రానున్నట్లు చెప్పారు.

కంటి వైద్యశిబిరం

శింగనమల జూన్8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని వాసవి కల్యాణ మండపంలో ఆదివారం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటైంది. కర్నూలుకు చెందిన శాంతిరాం ఆస్పత్రి వైద్యులు పాల్గొని 150 మందికి కంటి పరీక్షలు చేశారు. అందులో 50 మందిని ఆపరేషన్ కోసం రెఫర్ చేశారు. కార్యక్రమంలో శింగనమల వాసవీక్లబ్ అధ్యక్షుడు మురళి, సభ్యులు రంగస్వామి, శంకరగుప్త, జొన్నలగడ్డ శేషయ్య, పార్థసారధి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు నిరసనలు

శింనమల జూన్8(ఆంధ్రజ్యోతి): రైతులు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న తహసీల్దార్ కార్యాలయాల వద్ద సోమవారం నిరసనలు చేపట్టనున్నామని, రైతులందరూ పెద్దఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యంగా రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలు 90 శాతం సబ్సిడీతో పంపిణీ చేయాలని, పత్తి రైతులకు సబ్సిడీలో 90 శాతం పత్తి విత్తనాలు అందజేయాలని , అలాగే పంట రుణాలను బ్యాంకుల్లో వడ్డీ మాత్రమే కట్టించుకుని రెన్యువల్ చేయాలనే డిమాండ్లతో తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఘర్షణలో ఏడుగురికి గాయాలు

గార్లదిన్నె, జూన్8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుంపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన ఘర్షణలో ఏడుగురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కనుంపల్లికి చెందిన నల్లమ్మ, సంతోష్, ఇందు, మరొక వర్గానికి చెందిన కుమార్, ప్రసాద్, వెంకటలక్ష్మి, మరొకరు పాత కక్షల కారణంగా గొడవ పడ్డారన్నారు. ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకోవడంతో అందరూ గాయపడ్డారన్నారు. వారిని స్థానికులు 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పెనకచెర్లలో హైటెన్షన్

● భారీగా చేరుకున్న పోలీసులు



ఘర్షణపై ఆరా తీస్తున్న సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐ మహమ్మద్ గౌస్‌బాషా

గార్లదిన్నె, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనకచెర్లలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. పాత కక్షలు మనసులో పెట్టుకుని చేసిన దాడిలో యశ్వంత్ (16) అనే బాలుడు శనివారం మృతి చెందిన విషయం విదితమే. దీంతో ఆదివారం పోలీసులు గ్రామానికి పెద్దఎత్తున చేరుకున్నారు. పెనకచెర్ల గ్రామంలో శివరాత్రి పండుగ వేళ ఇద్దరు బాలల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చేరాడు. చికిత్స అనంతరం గ్రామంలోకి వచ్చిన బాలుడు యశ్వంత్‌పై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే శనివారం యశ్వంత్‌తో గొడవకు దిగి కట్టెతో తలపై గట్టిగా కొట్టాడు. దీంతో యశ్వంత్ స్పృహ కోల్పోయాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా యశ్వంత్ మార్గమధ్యంలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న శింగనమల సీఐ కౌలుట్లయ్య హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. ఘర్షణలో బాలుడు మృతి చెందడంతో గ్రామంలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. దీంతో శింగనమల సీఐ కౌలుట్లయ్య, గార్లదిన్నె, శింగనమల, నార్పల ఎస్‌ఐలు మహమ్మద్‌గౌస్‌బాషా, సాగర్, విజయ్‌కుమార్‌తో పాటు సిబ్బంది గ్రామంలో బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



ఆస్పత్రిలో ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్‌వినోద్‌కుమార్, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ నాయకురాలు బండారు లీలావతి

రోడ్డు ప్రమాద బాధితులకు కలెక్టర్ పరామర్శ

● మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆదేశం

అనంతపురం టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గార్లదిన్నె మండలం తిమ్మంపేట వద్ద గల 44వ జాతీయ రహదారిపై గత శనివారం రాత్రి 10 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కల్లూరు ఇందిరమ్మ కాలనీకి చెందిన కూలీ గంగమ్మ(45) అక్కడికక్కడే మృతి చెందగా... కల్లూరు, ఎగువపల్లి గ్రామాలకు చెందిన 27 మంది కూలీలు గాయపడిన విషయం తెలిసిందే. అందులో 18మంది అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం రాత్రి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ప్రస్తుతం ఆరోగ్యంఎలా ఉంది.. ప్రమాదం ఎలా జరిగిందని అడిగి తెలుసుకున్నారు. వీరికి మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులకు సూచించారు. అలాగే ఆ కుటుంబాలను ఆదుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ పరామర్శ..

గార్లదిన్నె: అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోడ్డు ప్రమాద బాధితులను ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకురాలు బండారు లీలావతి, ఆర్డీఓ కేశవనాయుడు తదితర అధికారులు పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు.

అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

● పలు పార్టీలు, ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

అనంతపురం సెంట్రల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలంలో బాలికపై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌తో కలిసి ఆదివారం బాధితురాలి గ్రామానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. దళితుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అత్యాచారాలకు, అఘాయిత్యాలకు పాల్పడటం దుర్మార్గమన్నారు. 14మంది వరకు బాలికను అత్యాచారం చేయడం సమాజానికి మాయని మచ్చలాంటిదన్నారు. రాజకీయాలకు ముడిపెట్టకుండా అత్యాచారంలో భాగస్వామ్యమైన అందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. అలాగే బాధిత కుటుంబానికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం ద్వారా చెల్లించాల్సిన పరిహారానికి అదనంగా రూ.50లక్షలు అందజేసి, బాలిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు.

● అత్యాచారం చేసిన వారిని శిక్షించాలని కోరుతూ నగరంలోని అంబేడ్కర్ విగ్రహంవద్ద ఆర్‌ఈఎఫ్, దళిత, గిరిజన ప్రజా సంఘాల నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర మాట్లాడుతూ.. బాలికపై నరరూప రాక్షసులు సాగించిన అఘాయిత్య వీడియోలు, ఆడియో రికార్డింగులను సామాజిక మాధ్యమాలనుంచి తొలగించాలని కోరారు. అత్యాచారం కేసును త్వరతగతిన విచారించి మానవ మృగాలను రిమాండ్‌కు పంపాలని డిమాండ్‌చేశారు. అలాగే నిజ నిర్ధాన కమిటీ నాయకులు కూడా నిందితులను శిక్షించాలంటూ అంబేడ్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై నిరసన వ్యక్తంచేశారు. కమిటీ సభ్యులు సాకేహరి, కుళ్లాయప్ప, ఉరేష్, ఓబులేసు, ఆనంద్, కదిరప్ప, సుమగించి శ్రీనివాసులు, నరేష్, హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి అన్నిరకాల న్యాయం జరిగేంతవరకు అండగా పోరాడుతామన్నారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు నాయకులు పాల్గొన్నారు.

● శింగనమల: రామగిరి మండలంలో మైనర్ బాలికపై అత్యాచారం చేసిన 12 మంది యువకులను వెంటనే అరెస్టు చేయాలని ఎమార్పీఎస్ జిల్లా నాయకుడు చిన్నజలాలపురం ఓబిలేసు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళిత విద్యార్థినిని 12 మంది యువకులు కలిసి నమ్మించి అత్యాచారం చేశారన్నారు. ఆమె గర్భం దాల్చడంతో వారంతా మాకు ఎలాంటి సంబంధం లేదని తప్పించుకున్నారన్నారు. అదీగాక రాజకీయ పార్టీ నాయకుల అండతో దర్జాగా తిరుగుతున్నారన్నారు. వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నల్లప్ప, మురళి, రాము, సురేష్, నరేంద్ర పాల్గొన్నారు.

● రామగిరి: మండలంలో మైనర్ బాలికపై జరిగిన సాముహిక అత్యాచార ఘటనను మాదిగ సంఘాల నాయకులు ఖండించారు. ఆదివారం వారు బాధితురాలిని గ్రామానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం 5ఎకరాల వ్యవసాయ భూమి, పక్కా ఇళ్లు ఇవ్వాలన్నారు. బాలిక సంరక్షణ కొరకు ఆమె తల్లికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. మాదిగ దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ , దళిత సంఘాల నాయకులు దండోరా శ్రీరాములు, దుబ్బర్లపల్లి సుబ్బరాయుడు, పోతన్న, వెంకటరాముడు, ఏపీ ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

● తెలుగు మహిళల డిమాండ్ ● పోలీసులకు ఫిర్యాదు



రాప్తాడు, గార్లదిన్నె పోలీసుస్టేషన్లలో వినతిపత్రాలు ఇస్తున్న తెలుగు మహిళలు

రాప్తాడు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌కు చెందిన న్యూస్ చానల్‌లో రాష్ట్ర రాజధాని అమరావతికి చెందిన మహిళలను కించ పరిచేలా వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని రాప్తాడు నియోజకవర్గ తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వారు మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. పలువురు మాట్లాడుతూ.. అమరావతి వేశ్యల రాజధాని అంటూ జగన్ చానల్‌లో నిర్వహించిన డిబేట్‌లో జర్నలిస్టులు మాట్లాడారన్నారు. ఆ వ్యాఖ్య లు ఆ ప్రాంత మహిళలకే కాకుండా రాష్ట్ర వ్యా ప్తంగా ఉన్న మహిళలందరినీ కించ పరిచేలా ఉన్నాయన్నారు. ఆ వాఖ్యలు చేసిన కొమ్మినేని శ్రీనివాస్‌రావ్‌తో పాటు కృష్ణంరాజులపై కేసులు నమోదు చేయాలన్నారు. అలాగే ఆ చానల్ నిర్వహిస్తున్న భారతిరెడ్డిపైన కూడా కేసు నమో దు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు లక్ష్మీదేవి, ధనలక్ష్మి, సుకన్య, అనిత, హేమలత తదితరులు పాల్గొన్నారు.

● గార్లదిన్నె: రాష్ట్ర రాజధాని కోసం భూములిచ్చిన మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుర్రం ఆదినారాయణ, పలువురు తెలుగు మహిళలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగన్‌కు చెందిన న్యూస్ చానల్ డిబేట్‌లో అమరావతి వేశ్యల రాజధాని అంటూ జర్నలిస్టులు అనుచిత వ్యాఖ్యలు చేయడంపై నీచమన్నారు. ఆ డిబేట్ నిర్వహించిన న్యూస్‌చానల్‌పై, వాఖ్యలు చేసిన జర్నలిస్టులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాజధాని నిర్మాణంలో సీఎం చంద్రబాబుకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక జగన్ చానల్ విషం చిమ్ముతోందని వారు దుయ్యబట్టారు. తెలుగుమహిళలు విజయలక్ష్మి, లక్ష్మిదేవి, నారాయణమ్మ, నాయకులు కొండమీదరాయుడు, కొర్రపాటి శీనా, కదిరప్ప, రామాంజనేయులు, రాజా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయి భిక్షాటన



భిక్షాటన చేస్తున్న సాయి భక్తులు

అనంతపురం కల్చరల్, జూన్8(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం నగరంలోని మూడవరోడ్డు షిర్డీసాయి ఆలయం ఆధ్వర్యంలో స్థానికంగా పలు ప్రాంతాల్లో సాయి భిక్షాటన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీసభ్యులతోపాటు సాయి భక్తులు భజనలు చేస్తూ.. ఇంటింటికీ తిరుగుతూ భిక్షాటన చేశారు. భిక్షాటనలో సేకరించిన నిత్యావసర సరుకులను గురుపౌర్ణమి నాడు భక్తులకోసం అన్నదానానికి వినియోగించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

పలు దుకాణాలకు జరిమానా

అనంతపురం క్రైం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): నగరపాలిక అధికారులు ప్లాస్టిక్ వినియోగంపై పలు దుకాణాలకు జరిమానా విధించారు. కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ పావని నగరంలోని లెక్చరర్స్ కాలనీ, పాతూరు, రా జీనగర్, ఒకటో రోడ్డు , ఆరో రోడ్డులలోని దుకాణాలలో తనిఖీ చేశారు. పలు దుణాల్లో ప్లాస్టిక్ వినియోగిస్తున్నట్లు గుర్తించి మొత్తం రూ.1.02లక్షల మేర జరిమానావిధించారు.

కార్యవర్గం ఎంపిక

అనంతపురం కల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): భట్రాజుల సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎంపికైంది. శారదానగర్‌లోని వివేకానంద ధ్యాన మందిరం(భట్రాజు కల్యాణమండపం)లో ఆదివారం అక్కిరాజు సుధాకర్ రాజు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఇందులో జిల్లా నూతన కార్యవర్గం ఎంపికను నిర్వహించారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎల్లమరాజు బాలాజీ, ప్రధాన కార్యదర్శిగా బట్టు మనోహర్‌కుమార్, కోశాధికారిగా అక్కిరాజు మారుతీరాజు, ఉపాధ్యక్షులుగా సరోజమ్మ, శ్రీనివాస్‌వర్మ, బాలగిరి నాగభూషణరాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా గోవిందరాజు, సహాయ కార్యదర్శులుగా రంగనాథం, అనసూయమ్మను ఎంపిక చేశారు

వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌పై అవగాహన

శింగనమల జూన్8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచేపల్లి, నారాయణ వారి పల్లి గ్రామాల్లో ఆదివారం కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి వారు వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలుడాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ కిశోర్, డాక్టర్, మూత్యాలరావు మాట్లాడుతూ.. రైతులు పంటల సాగులో అధిక మోతాదులో ఉపయోగించే ఎరువులు, పురుగు మందులకు స్వస్తి పలికి నూతన పద్ధతులు పాటించాలని సూచించారు. సాంకేతికత విషయాల్లో డ్రోన్ స్ప్రేయింగ్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఓ అన్వేష్‌కుమార్, పశువైద్యుడు కిరణ్ కుమార్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అనంతపురం కల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గుడ్ షెపర్డ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు చెందిన పూర్వవిద్యార్థులు ఆదివారం గెట్‌టుగెదర్‌ను ఘనంగా నిర్వహించారు. ఆ పాఠశాలలో 1993లో టెన్త్ చదివిన విద్యార్థులు మళ్లీ ఇన్నేళ్లకు స్థానిక అలెగ్జాండర్ హోటల్‌లో ఒక్కటిగా కలిశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాటి గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌ఎం ఇందిరా, అధ్యాపకులు ప్రభావతి, పద్మ, ఈశ్వరమ్మ, జెపమని, రంగయ్య, ఈశ్వరయ్య, పూర్వ విద్యార్థుల పాల్గొన్నారు.

●శింగనమల: మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో 1999-2000 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి గురువులు లక్ష్మిరెడ్డి, చంద్రశేఖర్, బంగారప్ప, శేషాంద్రిశర్మ, మహ్మద్‌రఫీని ఘనంగా సత్కరించారు.

●ఆత్మకూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో 1997-98లో టెన్త్ చదివిన విద్యార్థులు అదే పాఠశాలలోనే ఉపాధ్యాయుడు శ్రీనివాస మూర్తి అధ్యక్షతన గెట్‌టుగెదర్ నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులు అంకిరెడ్డి, వెంకటరమణ, రామంజనరెడ్డి, రామచంద్రారెడ్డి, సావిత్రమ్మ, విజయకుమారి, రమణ, విష్ణుమూర్తిని ఘనంగా సన్మానించారు.



అనంతపురంలోని షెపర్డ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, శింగనమల, ఆత్మకూరు జిల్లా పరిషత్ పాఠశాలల్లో గురువులతో పూర్వ విద్యార్థులు

ఈఏపీసెట్ ఫలితాల్లో సత్తా



శివానందరెడ్డి

అనంతపురం విద్య, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈఏపీ సెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ఆదివారం విడుదలైన ఈ ఫలితాల్లో నారాయణ కళాశాల విద్యార్థి నితిన్ అగ్నిహోత్రితో పాటు నగరంలోని నలంద కళాశాల విద్యార్థుల మంచి మార్కులు సాధించారు. ఇంజనీరింగ్‌లో శివానందరెడ్డి 4152వ ర్యాంకు, నాగరాజు 7162వ ర్యాంకు, శిరీష 8024వ ర్యాంకు, నిహారిక 14018వ ర్యాంకు, హర్షిత చౌదరి 15508వ ర్యాంకు, యశ్వంత్‌రెడ్డి 18 వేల ర్యాంకు సా ధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాళ్లు ఖాజీబాబు, వినోద్‌బాబు తెలిపారు. సుమారు 145 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారన్నారు. అగ్నికల్చర్,ఫార్మసీ విభాగంలో 16 మంది సత్తాచాటినట్లు వారు పేర్కొన్నారు.

శిల్పారామాన్ని సందర్శించిన కలెక్టర్



శిల్పారామంలో పర్యటిస్తున్న కలెక్టర్

అనంతపురంరూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక శిల్పారామంను కలెక్టర్ వినోద్‌కుమార్ సందర్శించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నేషనల్ పార్క్‌కు ఆదివారం ఉదయం వచ్చిన ఆయన అక్కడి శిల్పారామంను సందర్శించి శిల్పాలను, ఇతరత్రా వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజలతో సౌకర్యాలపై ఆరా తీశారు. శిల్పారామం అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలను సంబంధిత అధికారులకు సూచించారు. ఆ మేరకు నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దివాకర్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌రావు, శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

గంటలోనే చిన్నారుల అప్పగింత



చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బసవతారకం కాలనీకి చెందిన లక్ష్మీదేవి తన 9 ఏళ్ల కూతురు లాస్య కన్పించడం లేదని అనంతపురం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో వెంటనే స్పందించిన సీఐ శేఖర్ ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ చర్యల్లో మరో నలుగురు పిల్లలు మధు, ప్రభు, సుధీర్, కుట్టీ మిస్సయినట్లు గుర్తించారు. వీరందరి కోసం గాలింపు చర్యలు చేపట్టి గంట వ్యవధిలోనే చిన్నారుల ఆచూకీని గుర్తించారు. ఐదుగురు చిన్నారులను వారి తల్లిదండ్రులకు అనంతపురం రూరల్ పోలీసులు అప్పగించారు. గంటలోపే ఫిర్యాదు చేయకపోయిన మిగిలిన చిన్నారులను సైతం గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

తోపుడుబండి వితరణ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారం చేసుకుంటున్న పేద రాలికి దాతలు అండగా నిలిచారు. నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో కూరగాయలు, ఆకుకూరల వ్యాపారం చేసుకుంటూ పెరాలసిస్‌తో బాధపడుతున్న తన భర్తను కాపాడుకుంటూ జీవనం సాగిస్తున్న పేదరాలు వెంకటమ్మకు ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ప్రతినిధులు తోపుడుబండిని ఆదివారం వితరణ చేశారు. పేదరాలి దుస్థితిని తెలుసుకున్న దాతలు స్పందించి సాయం అందజేశారు. ఇందుకు ఆమె వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తాడిపత్రి ఉపఖజాన అధికారి ఫరూక్, ఉపాధ్యాయులు బాలన్న, శివశంకరయ్య, ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఉపాధ్యక్షులు వద్ది చంద్రశేఖర్, కరుణాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్, కన్వీనర్ శ్రీహరి, సహాయ కార్యదర్శులు గౌరవ సలహాదారులు తదితరులు పాల్గొన్నారు.

వైశ్య హాస్టల్‌ను సద్వినియోగం చేసుకోండి

అనంతపురం కల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని వైశ్య హాస్టల్ ద్వారా అందిస్తున్న సదుపాయాన్ని రాయలసీమలోని ఆర్యవైశ్య విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆ హాస్టల్ కార్యదర్శి ముడియం రమణ ఆదివారం ప్రకటనలో కోరారు. ఆర్యవైశ్య విద్యార్థులకోసం ఆరోగ్యకరమైన భోజన సదుపాయంతో పాటు మెరుగైన వసతులు కల్పించనున్నామన్నారు. ఆర్యవైశ్య విద్యార్థులు ఆర్థిక సమస్యలతో బాధపడకుండా ఉత్తమ విద్యను అభ్యసించడంతో పాటు ఉన్నత స్థానాలను అధిరోహించాలనే సంకల్పంతో ఈ హాస్టల్‌ను నిర్వహిస్తున్నామన్నారు. విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న ఆర్యవైశ్య యువతకోసం కూడా ఈ హాస్టల్లో వసతి కల్పించనున్నట్లు చెప్పారు. కాబట్టి ఈ అవకాశాన్ని ఆర్యవైశ్య విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్యవైశ్య హాస్టల్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకోదలచిన విద్యార్థులు 7702159505 నెంబర్‌ను సంప్రదించి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలకు 134 మంది హాజరు

అనంతపురం సెంట్రల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ ఇన్‌స్టంట్ పరీక్షలకు 134మంది విద్యార్థులు హాజరయ్యారని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సీఈ డాక్టర్ లోకేష్ తెలిపారు. ఆదివారం కేఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాన్ని రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు, డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీరమణ, సీఈ డాక్టర్ లోకేష్, కళాశాల ప్రిన్సిపాల్ సత్యలత పరిశీలించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఒక సబ్జెక్టు మిగిలిపోయిన విద్యార్థులకు ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఉదయం పరీక్షలు నిర్వహించి సాయంత్రం మూల్యాంకణం చేయించామన్నారు. ఫలితాలను సోమవారం జ్ఞానభూమి పోర్టల్లో ప్రదర్శిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ శంకర్, సూపరింటెండెంట్ మారుతీ, సిబ్బంది సాయిశివ, దేవా, బాలాజీ నాయక్, తిరుపాలు, నారాయణస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల్లో మార్పులు వద్దు

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు



మాట్లాడుతున్న ఓబులు

అనంతపురం కల్చరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేలా కార్మిక చట్టాలలో మార్పులు చేస్తున్నాయని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి ఓబులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత 15 సంవత్సరాలుగా షెడ్యూల్ ఎంప్లాయ్‌మెంట్ కార్మికులకు వేతనాలు సవరించలేదని, కార్మిక సంక్షేమ బోర్డుకు చైర్మన్, కమిటీ సభ్యులను నియమించలేదన్నారు. రాత్రిపూట మహిళలచే పనులు చేయిస్తే వారికి రక్షణ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్లో చేసిన మార్పులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, నాయకులు నాగేంద్రకుమార్, గోపాల్, వెంకటనారాయణ, ముత్తుజ, రామాంజనేయులు, శకుంతల, నిర్మల, మేరీ, గోవిందమ్మ, లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

జగన్ క్షమాపణ చెప్పాలి



గుంతకల్లులో సీఐకి ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు



కళ్యాణదుర్గంలో జగన్ పత్రికలను దహనం చేస్తున్న తెలుగు మహిళలు

ఆయన చానల్, పత్రికపై పలు చోట్ల నిరసన

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్ : రాష్ట్ర రాజధాని అమరావతిని వేశ్యల రాజధాని అంటూ జగన్ చానల్ వేదికగా జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసులు, కృష్ణంరాజు వ్యాఖ్యలు చేయడం.. జగన్ పత్రికలో ప్రచురించడంపై తెలుగు మహిళలు ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని మహిళలకు మాజీ సీఎం బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, ఆ జర్నలిస్టులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పలు ప్రాంతాల్లో జగన్ పత్రికలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కళ్యాణదుర్గంలో తెలుగుమహిళలు పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట నినాదాలు చేశారు. రాయదుర్గంలో జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసులుపై కేసు నమోదు చేయాలని తెలుగుదేశం పార్టీ మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు భారతి పట్టణ ఎస్‌ఐ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందించారు. ఉరవకొండలో టీడీపీ మహిళ విభాగం నాయకురాళ్లు కొమ్మినేని శ్రీనివాసరావు, జర్నలిస్టు కృష్ణమరాజు ఫొటోలను చెప్పులతో కొడుతూ నిరసన వ్యక్తం చేశారు. తాడిపత్రిలో జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులను అరెస్టు చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ అరుణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుంతకల్లులో ఆ జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షురాలు తలారి సరోజమ్మ ఆధ్వర్యంలో నాయకురాళ్లు పోలీసులకు ఫిర్యాదుచేశారు. పుట్లూరులో టీడీపీ మహిళా నాయకురాలు వరలక్ష్మి ఎస్‌ఐ వెంకటనరసింహంకు ఫిర్యాదు చేశారు.



ఉరవకొండలో కేఎస్ఆర్, కృష్ణంరాజు ఫొటోలను దహనం చేస్తున్న మహిళలు



తాడిపత్రిలో ఫిర్యాదు చేస్తున్న మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్, కౌన్సిలర్లు



రాయదుర్గంలో ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న మహిళలు

అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం



ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే కాలవ, ఉండాల హనుమంతరెడ్డి

రాయదుర్గం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డ్ కమిటీ చైర్మన్‌గా ఉండాల హనుమంతరెడ్డి, పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం అట్టహాసంగా సాగింది. వీరితో మార్కెట్‌యార్డ్ కార్యదర్శి శ్రీనివాసులు ప్రమాణం చేయించారు. అనంతరం వీరిని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సహకారం.. సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. వీరి స్ఫూర్తితో నియోజకవర్గంలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, మరిన్ని చేపట్టబోతున్నామని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు వెంకటశివుడుయాదవ్ మాట్లాడుతూ.. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు ధైర్యంగా నిలబడ్డ కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు ఉంటుందని, హనుమంతరెడ్డే అందకు సాక్ష్యమని కొనియాడారు. చైర్మన్ హనుమంతరెడ్డి మాట్లాడుతూ మార్కెట్‌యార్డ్ అభివృద్ధి చేస్తామన్నారు.

విత్తన వేరుశనగ పంపిణీ

రాయదుర్గంరూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన సబ్సిడీతో విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక మార్కెట్‌లో విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదివారం ప్రారంభించారు. ఇందులో టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, మార్కెట్‌యార్డ్ చైర్మెన్ హనుమంతరెడ్డి, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ నాగిరెడ్డిపల్లి హనుమంతు, సర్పంచులు రాజశేఖర్‌రెడ్డి, వన్నూరుస్వామి మాజీ జడ్పీటీసీ విజయకుమార్ పాల్గొన్నారు.

ఆ ఇద్దరిని ప్రభుత్వ వసతి గృహాల్లో చదివిస్తాం

● ఆర్డీవో వసంతబాబు

శెట్టూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన ఆ ఇద్దరు చిన్నారులను ప్రభుత్వ వసతి గృహాల్లో చేర్పించి, చదివిస్తామని ఆర్డీవో వసంతబాబు పేర్కొన్నారు. ఆదివారం ఆంధ్రజ్యోతి దిన పత్రికలో 'పాపం పసివాళ్లు' అన్న శీర్షికన మానవీయ కోణంలో కథనం ప్రచురితం కావడంతో ఆర్డీవో వసంతబాబు, కళ్యాణదుర్గం తహసీల్దార్ భాస్కర్ ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీరి దీన పరిస్థితిని చూసి చలించిపోయారు. కుటుంబానికి రూ. 8 వేలు ఆర్థికసాయం అందచేశారు. కుమారు లు త్రిలోకనాథ్‌ను ప్రభుత్వ వసతి గృహాల్లో చదివిస్తామని హామీ ఇచ్చారు.



చిన్నారులతో మాట్లాడుతున్న ఆర్డీవో, తహసీల్దార్

అవినీతిపరులపై ఫిర్యాదు చేయండి

గుత్తి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పట్టాదారు పాస్‌పుస్తకం, వాల్టా ధ్రువీకరణ పత్రాలు, ఈడబ్ల్యూఎస్, నాన్ రీమ్యారేజ్ సర్టిఫికేట్, నిరుద్యోగ ధ్రువీకరణ పత్రాలు, లీగల్ ఫ్యామిలీ, హెయిర్ సర్టిఫికేట్ తదితర వాటి కోసం దళారులను ఆశ్రయించరాదని తహసీల్దార్ ఓబులేసు ఆదివారం సూచించారు. వీటి కోసం రెవెన్యూ కార్యాలయ సిబ్బందిని నేరుగా ఆశ్రయించాలని, వీఆర్వోలు, ఆర్ఐలు, సర్వేయర్లు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే తనకు ఫిర్యాదు చేయాలని కోరారు.

డ్రైనేజీ పనులు త్వరగా పూర్తిచేయండి

తాడిపత్రి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అండర్‌డ్రైనేజీ సమస్యను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కాంట్రాక్టర్ హరినాథ్‌రెడ్డికి సూచించారు. ఈ మేరకు ఆ పనులకు అవసరమైన నిధులు వారు ఆయనకు అందజేశారు. బిల్లులు వచ్చిన తర్వాత ఆ డబ్బులు ఇవ్వాలని, మొదట పట్టణ ప్రజలు ఇబ్బందులు పడకుండా పనులు తొందరగా పూర్తి చేయాలని సూచించారు.

కసాపురంలో కంపు...

గుంతకల్లుటౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం పరిస్థితి అధికారుల నిర్లక్ష్యం వల్ల పేరు గొప్ప.. ఊరు దిబ్బలా తయారైంది. కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్లాలంటే మురుగు నీటిని దాటుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామంలో ప్రధాన రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తుంది. అయినా ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారులు చోద్యం చేస్తున్నారు.



ప్రధాన రహదారుల్లో ప్రవహిస్తున్న మురుగు



వాల్మీకి సర్కిల్ అభివృద్ధికి అడుగులు

రూ. 50 లక్షల సొంత నిధులతో ఎమ్మెల్యే అమిలినేని ప్రణాళిక

కళ్యాణదుర్గం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక వాల్మీకి సర్కిల్ అభివృద్ధి చేసి ఒక వ్యాపార సముదాయంగా మార్చేందుకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. తన సొంత నిధులు రూ. 50 లక్షలతో త్వరలో ఈ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఆ సర్కిల్ అభివృద్ధి నమూనాను కూడా ఇటీవల విడుదల చేశారు. ఆ సర్కిల్‌ను పట్టణానికే తలమానికంగా మార్చేలా అభివృద్ధి చేయనున్నారు. ఇటీవలే ఆ ప్రాంతంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు కూడా పూర్తి చేశారు. మొదట వాల్మీకి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామనుకున్నా.. స్థానికుల కోరిక మేరకు అతి పెద్ద రాతి విగ్రహాన్నే ఎమ్మెల్యే ఏర్పాటు చేయబోతున్నారు. కేవలం ఈ విగ్రహం తయారీకే రూ. 10 లక్షలకు పైగా ఖర్చు అవుతున్నట్లు అంచనా. మిగిలిన రూ. 40 లక్షలతో వాల్మీకి సర్కిల్‌ను రూపురేఖలను మార్చనున్నారు.



వాల్మీకి సర్కిల్ అభివృద్ధి నమూనా

త్వరలో పనులు



వాల్మీకి సర్కిల్‌లో నా సొంత నిధులు రూ. 50 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నాం. డబ్బు విషయం రాజీ పడకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా. అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తా. ఇప్పటికే పట్టణంలో చాలా అభివృద్ధి పనులు చేశాను. కోట్లాది రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రహదారుల విస్తరణ చేశాం. నియోజకవర్గాన్ని అభివృద్ధికి కేరాఫ్‌గా మార్చుతా.

-అమిలినేని సురేంద్రబాబు, ఎమ్మెల్యే

ఎమ్మెల్యే నిర్ణయం హర్షణీయం



ఎమ్మెల్యే సొంత డబ్బులు రూ. 50 లక్షలతో వాల్మీకి విగ్రహంతో పాటు, వాల్మీకి సర్కిల్‌ను అభివృద్ధి చేస్తే వ్యాపారపరంగా ఆ సర్కిల్ అభివృద్ధి చెందుతుంది. సర్కిల్ అభివృద్ధి నమూనా అద్భుతంగా ఉంది. వాల్మీకుల దశాబ్దాల కళ నెరవేరుతోంది. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే కృషి మరవలేనిది.

-వైపీ రమేష్, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, కళ్యాణదుర్గం.





పూర్వవిద్యార్థుల కలయిక

గుత్తి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక మాల్టాస్మిత్ ఉన్నత పాఠశాలలో 1999-2000లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. నాటి గురువులు కిరణ్, రాజేంద్రప్రసాద్, శ్యామ్‌నేథానియల్, విజయ్‌శేఖర్, బాలశౌరి, అమృతా, గ్రేస్, రూపికా, కమలినీ, నిర్మల, సిబ్బంది ఆంజనేయులును సన్మానించారు.

● కంబదూరు : మండలంలోని నూతిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-2004న పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. నాటి గురువులు అన్నపూర్ణమ్మ, ఇంద్రాని, రామకృష్ణ, రాజగోపాల్‌ను సన్మానించారు.

● పెద్దవడుగూరు : స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2004 - 2005లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశయ్యారు. నాటి గురువులు మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, రామాంజులమ్మ, వెంకటేశ్వర్లు, బేగంను ఘనంగా సన్మానించారు.



ఇంటర్వ్యూ

అవసరం మేరకే ఎరువులు వాడాలి

మండల వ్యవసాయాధికారి సాయికుమార్



బొమ్మనహాళ్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో రైతులు పంటలు వేసేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. భూసార పరీక్షలు చేయించుకోవాలి. దాన్ని బట్టే ఏ పంట సాగు చేయాలి.. ఏ ఎరువు.. ఎంత వాడాలి అనేది నిర్ధయించుకోవాలి.. అని మండల వ్యవసాయాధికారి సాయికుమా ర్ రైతులకు సూచించారు. ఆయనతో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ ఇలా సాగింది ...

ప్రశ్న: అధిక దిగుబడి ఎలా పొందవచ్చు ?

ఏఓ: నాణ్యమైన విత్తనాలు విత్తుకోవాలి. తగు మోతాదులోనే ఎరువులు, పురుగులమందులు వాడాలి. వరికి ఎకరాకు మూడు యూరియా బస్తాలే వేయాలి. ఎక్కువ వేస్తే ఎత్తుగా పెరిగి నేలకొరుగుతుంది. ప్రస్తుతం వర్షాలు కురిస్తే పత్తి పంటలో నీరు పెట్టరాదు. నిల్వ ఉన్న నీటిని తొలగించి యూరియా వేయాలి. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి యాజమాన్య పద్ధతుల్లో సాగుచేస్తే మంచి దిగుబడి వస్తుంది.

ప్రశ్న: మండలంలో ఏ ఏ పంటలు సాగు చేస్తున్నారు.?

ఏఓ: మండలంలో మొత్తం 32 వేల ఎకరాల్లో ప్రధానంగా వరి, మొక్కజొన్న, వేరుశెనగ, పత్తి పంటలను సాగు చేస్తున్నారు. ఈ సారి వర్షాలు బాగా వస్తే కందులు, ఆముదం పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపుతారు. పొలంబడి ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: ఎరువులు అందుబాటులో ఉన్నాయా?

ఏఓ: ఈ ఖరీఫ్‌లో రైతులకు ఎరువుల కొరత ఉండదు. రైతులు అవసరం మేరకు ఎరువులు వాడాలి. 550 మెట్రిక్ టన్నులు ఎరువులను రైతుసేవా కేంద్రాలు, సొసైటీల్లో అందుబాటులో ఉంచుతాం. రైతులు మార్కెట్లో ప్రభుత్వం అనుమతి పొందిన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనాలి. రసీదు తీసుకోవాలి. నాణ్యత విషయంలో ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే వ్యవసాయ అధికారులకు తెలపాలి.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ



పోతప్ప విగ్రహం

బొమ్మనహాళ్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్‌లో పోతప్పస్వామి, సుంకులమ్మ, నాగుల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులకు అన్న సంతర్పణం చేశారు.

మాజీ జడ్పీటీసీ మాతృమూర్తికి నివాళి

కుందుర్పి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెస్తరపల్లికి చెందిన మాజీ జడ్పీటీసీ మల్లికార్జున మాతృమూర్తి లక్ష్మీదేవి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆదివారం ఆమె చిత్రపటం వద్ద ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నివాళులర్పించారు.

అన్నదానానికి విరాళం

గుంతకల్లుటౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసాపురంలో వెలసిన శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో అన్నదానానికి పట్టణానికి చెందిన భానుమతి రూ. 25వేలను ఆదివారం విరాళం ఇచ్చింది. అలాగే ప్రభావతి రూ.5,116 విరాళమిచ్చారు.

వైద్యశిబిరానికి స్పందన

యాడికి, జూన్8(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో యాడికిలో ఆదివారం ఊపిరితిత్తుల వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 80 మంది రోగులు ఇందులో వైద్యపరీక్షలు చేయించుకున్నారు.

రామాలయం ప్రారంభం



అలంకరణలో విగ్రహాలు

యాడికి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుందనకోటలో రామాలయం ప్రారంభోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీతారామలక్ష్మణ హనుమ విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వాగోపాల్‌రెడ్డి, గ్రామ పెద్దలు వెంకట్రామిరెడ్డి, ఓబులపతి, శ్రీనివాసరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, బాలాంజనేయులు, కుందనకోట, గుడిపాడు, చింతాలయపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న కాలవ భరత్, నాయకులు

బొమ్మనహాళ్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవాడ గ్రామంలో టీడీపీ నాయకులు, యువకులు ఆధ్వర్యంలో 15 రోజులుగా నిర్వహిస్తున్న ప్రీమియర్‌లీగ్ క్రికెట్‌టోర్నీ ఆదివారంతో ముగిసింది. ఫైనల్లో కణేకల్లు జట్టుపై గోవిందవాడ ప్రీమియర్‌లీగ్ జట్టు విజయం సాధించింది. విన్నర్ టీంకు రూ.41.125, రన్నర్ టీంకు రూ. 20.225 ట్రోఫీలనుకాలవ భరత్ అందజేశారు. ఇందులో స్థానిక టీడీపీ నాయకులు సోమనాథ్‌గౌడ్, ఎస్‌జీ వన్నూరుస్వామి, కటెంబ్లి సుంకన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాతింటి వన్నూరుస్వామి పాల్గొన్నారు.

భీష్మ అవార్డుల ప్రదానం

కణేకల్లు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): టెన్త్, ఇంటర్‌లో అధిక మార్కులు సాధించిన మండలంలోని పూలచర్ల గ్రామానికి చెందిన నలుగురు విద్యార్థులకు జిల్లా బెస్త సంఘం భీష్మ ప్రతిభ పురస్కారాలను ఆదివారం అందజేసింది. ఇందులో ఆ విద్యార్థుల తల్లిదండ్రులు, ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా



వృథాగా పోతున్న నీరు

బొమ్మనహాళ్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవాడ క్రాస్‌లో మంచి నీటి ట్యాంకు నుంచి తాగు నీరు వృథాగా పోతోంది. పంచాయతీ వారు వాటర్‌మన్‌ను నియమించలేదు. దీంతో ఎవరో ఒకరు మోటర్ ఆన్ చేస్తే.. ట్యాంక్ నిండినా మోటార్‌ను ఆఫ్ చేసేవారు లేక నీరు ఇలా వృథా అవుతోంది. ఇలా కరెంట్, నీరు వృథా అవుతోంది.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పామిడి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పదో వార్డులో నివాసముంటున్న నిరుపేద బోయ పాండు అనారోగ్యంతో ఆదివారం మరణించారు. జనసేన పార్టీ నాయకులు లాయర్ సతీష్, సుబ్బు, వడ్డే రాము, శరత్, జమీర్, షేక్షావలి, లాలు, రోషన్, సలీం బాధిత కుటుంబానికి రూ.10వేలు అందజేశారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న జనసైనికులు

క్రైం న్యూస్..

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

గుత్తి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): జీఆర్పీ పరిధిలోని జక్కలచెరువు రైల్వే స్టేషన్ సమీపంలో రైల్లో నుంచి కింద పడి ఆదివారం ఓ వ్యక్తి మరణించాడు. మృతుడిని మహబుబ్‌నగర్ జిల్లా చౌడవారిపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య (52)గా గుర్తించామని జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. రేణిగుంట నుంచి మహబుబ్‌నగర్‌కు వెళ్లేందుకు బాగల్‌కోట్ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తూ.. జక్కలచెరువు రైల్వే స్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు రైల్లో నుంచి పడి మరణించాడన్నారు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కేసు దర్యాప్తులో ఉందని తెలిపారు.

ముగ్గురికి గాయాలు

బొమ్మనహాళ్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): బళారికి చెందిన బాషా తన భార్య, కూతురుతో కలిసి కణేకల్లుకు బైక్‌లో ఆదివారం బయలుదేరాడు. మండలంలోని ఎల్బీనగర్ గ్రామం వద్ద వీరి బైక్‌ను వెనుక వైపు నుంచి ఓ ట్రాక్టర్ ఢీకొంది. దీంతో బైక్‌పై వెళ్తున్న ఆ ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని ప్రైవేట్ అంబులెన్స్‌లో బళ్లారి విమ్స్‌ తరలించారు. బొమ్మనహాళ్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

కర్ణాటకలో డ్రైవర్‌కు ..

కుందుర్పి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అపిలేపల్లికి చెందిన డ్రైవర్ హనుమంతరాయుడు కుందుర్పి నుంచి మామిడి కాయలతో కర్ణాటక ప్రాంతంలోని బీజాపురం మార్కెట్‌కు బొలెరో వాహనంలో బయలుదేరాడు. బీజాపురం మార్కెట్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఇతని వాహనాన్ని ఢీకొనడంతో హనుమంతరాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని వెంటనే ఆస్పతికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని బీజాపురం పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

యల్లనూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగారెడ్డిపల్లి సమీపంలో శనివారం అర్ధరాత్రి బొలెరో వాహనంలో తరలిస్తున్న 19 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశామని ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని, వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

పగలే చోరీ

తాడిపత్రి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కడప రహదారిలోని సాయినగర్‌లో కుళ్లాయిరెడ్డి, పద్మ బుక్‌స్టాల్ నిర్వహిస్తున్నారు. వీరు రోజులాగే ఆదివారమూ ఇంటికి తాళం వేసి షాపునకు వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం వచ్చేసరికి దుండగులు కిచెన్‌కు దగ్గర ఉన్న కిటికీ గ్రిల్ కట్ చేసి.. ఇంట్లో చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. చైన్, నల్లపూసల దండ, కమ్మలు, వెండి తదితర వస్తువులు చోరీ అయినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

గుత్తి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గుత్తి నుంచి పెద్దవడుగూరుకు ద్విచక్రవాహనంలో నాటు సారా తరలిస్తున్న తుగ్గలి మండలం చమ్లా తండాకు చెందిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఉమాదేవి ఆదివారం తెలిపారు. అతని నుంచి 20 లీటర్లు నాటుసారా, యాక్టివా స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.



సుంకులమ్మపాలెం వీధుల్లో ప్రవహిస్తున్న వర్షపునీరు

చిన్నపాటి వానకే..

తాడిపత్రి, జూన్8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వానకే చిత్తడి.. చిత్తడిగా మారింది. సీబీ రోడ్డు, నంద్యాలరోడ్డు, కూరగాయల మార్కెట్, హరిజనవాడ, సుంకులమ్మపాలెం, కృష్ణాపురం జీరోరోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలబడటంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

ఉగ్రవాదం అంతమే లక్ష్యం: ఎమ్మెల్సీ



పామిడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

పామిడి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఉగ్రవాదాన్ని అంతం చే యడమే బీజేపీ పంతమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఆపరేషన్ సిం దూర్ పై చాయ్ పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ మా ట్లాడుతూ... ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ సత్తా ఏంటో ప్రపంచానికి ప్రధాని మోడీ చాటిచెప్పారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వం శీకృష్ణ, యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్, మండ ల అధ్యక్షుడు అంజినాయక్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి పాల్గొన్నారు.

● రామస్వామి ఆలయాన్ని పునః నిర్మించండి

గుత్తి : పట్టణంలోని కోటలో ఉన్న పురాతన రామస్వామి దేవాలయాన్ని పునః నిర్మించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్సీ సోమువీర్రాజుకు ఆలయ కమిటీ సభ్యులు గుత్తిలో వినతిపత్రం అందజేశారు. ఇందులో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శివప్రసాద్, కార్యదర్శి ఎంకే చౌదరి, చక్రపాణి, రమేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

అవార్డుకు ఎంపిక

యాడికి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గత విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే షైనింగ్ స్టార్స్ అవార్డుకు మండలం నుంచి ఆరుగురు ఎంపికయ్యారని ఎంఈఓ కాశప్ప ఆదివారం తెలిపారు. యాడికిలోని ప్యారడైజ్ హైస్కూల్ నుంచి తేజా, వాగ్దేవి హైస్కూల్ నుంచి సోహిత్, లిఖిత, హరణి, లోహిత, వైష్ణవి ఎంపికైనట్లు తెలిపారు. సోమవారం అనంతపురంలో వీరికి కలెక్టర్, డీఈఓ ప్రశంసాపత్రం, ఒక్కొక్కరికి రూ.20 వేలు అందిస్తారన్నారు.

● బెళుగుప్ప : స్థానిక శ్రీనివాస విద్యానికేతన్ విద్యార్థులు వై. లావణ్య, పునీత్ కుమార్ నాయక్ షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ శ్రీనివాసులు తెలిపారు.